## 55. ఏది సుఖం?

ఓ భగవత్ భక్తుడు దేవుడి మీది వ్యామోహంతో ఓ కొండమీద చిన్న కుటీరాన్ని వేసుకుని ప్రశాంతంగా జీవిస్తున్నాడు. ఓ రోజు పెనుగాలికి దాని కప్పు ఎగిరిపోయే ప్రమాదం కలిగింది. దాంతో ఆ భక్తుడు వెంటనే శాంతించవలసిందిగా వాయుదేవుడ్ని ప్రార్థించాడు. అయినా ఫలితం లేకపోవడంతో అతను వాయుదేవుడి కుమారుడైన ఆంజనేయుడ్ని సహాయపడవలసిందిగా ప్రార్థించాడు. అయినా సహాయం అందకపోవడంతో, ఎవరి మాటని హనుమంతుడు జవదాటడో ఆ రాముడ్ని, వాయుదేవుడ్ని ప్రశాంతంగా వుండమని తన బంటుకి చెప్పమని ప్రార్థించాడు.

అయినా గాలి ఉధృతం తగ్గకపోవడంతో రాముడు తన ప్రాణమైన సీత మాట వింటాడని, సీతాదేవిని ప్రార్థించాడు, రాముడితో 'వాయుదేవుడ్ని ప్రశాంతంగా వుండమని తన బంటుకి చెప్పమని.' అయినా ఫలితం లేక అతని కుటీరం కప్పు గాలికి ఎగిరిపోయింది. దాంతో 'పోతే పోనీ' అనుకున్నాడు.

మన దేహం కూడా ఆ భక్తుని కుటీరం లాంటిదే. అది ఎప్పుడో ఒకప్పుడు ఎగిరిపోయేదే. దాన్ని పోనీకూడదని ప్రయత్నించే కన్నా, 'వుంటే వుండనీ, పోతే పోనీ' అని నిర్విచారంగా వుండగలగడమే సుఖం.

## 56. మహాత్ముడు

కొంతకాలం క్రితం భర్త మరణించిన ఓ యువతికి, తమ ఊరికి ఓ మహాత్ముడు వచ్చాడని తెలిసి శివాలయంలో బస చేసిన ఆయన దర్శనార్థం వెళ్ళింది. ఆయన ఆమెని చూడగానే 'దీర్ఘ సుమంగళీ భవ' అని ఆశీర్వదిస్తే ఆమె నిర్ఘాంతపోయి చెప్పింది.

"స్వామీ! నేను అనుకున్నట్లుగా మీరు నిజమైన మహాత్ములు కారు. నా భర్త చాలాకాలం క్రితం సముద్రంలో మునిగి మరణించాడు."

ఆయన బదులు మాట్లాడలేదు.

ఆమె ఇంటికి వెళ్ళేసరికి ఆమె భర్త ఎదురు రావడంతో ఆమె అవాక్కయింది.

"సముద్రంలో నేను ప్రయాణించే ఓడ మునిగింది కాని నేను ఓ చిన్న చెక్క సహాయంతో ఓ ద్వీపం చేరుకుని అక్కడ నించి ఇంకో ఓడలో ఇవాళే వచ్చాను." తన భార్యకి చెప్పాడతను.

ఆమె ఆ మహాత్ముడి మాటల గురించి భర్తతో చెప్పాక, ఇద్దరూ ఆయన దర్శనార్థం వెళ్ళారు.

## 57. అలవాటు

ఓ బీదవాడు ఓ మహాత్ముడి దగ్గరకి వెళ్ళి తనని ధనవంతుడ్ని చేయమని కోరాడు. ఆయన అతని వంక దయగా చూసి చెప్పాడు.

"ఇక్కడికి ఉత్తరం వైపు ఓ సముద్ర తీరం వుంది. అక్కడ ఇసకలో విలువైన రాళ్ళు దొరుకుతాయి. వాటిని ఏరి, అమ్మి ధనవంతుడివి అవు. అయితే అక్కడ చాలా రాళ్ళు వుంటాయి కాబట్టి ఏది విలువైందో తెలుసుకునే మార్గం ఒకటుంది. విలువైన రాయిని చేతిలోకి తీసుకోగానే అది వేడిగా వుంటుంది. అదీ గుర్తు."

అతను ఆ సముద్రం దగ్గరకి వెళ్ళి రాళ్ళని ఏరసాగాడు. వేడిగా లేని రాళ్ళని తనకి అడ్డంగా వుండకూడదని తక్షణం సముద్రంలోకి గిరాటేయసాగాడు. ఇలా కొన్ని రోజులు గడిచాక అతను ఓ రాయిని చేతిలోకి తీసుకోగానే అది వేడిగా వుండటం గుర్తించాడు.

'ఇప్పటికి విలువైన రాయి దొరికింది' అనుకుంటూ అతను అలవాటుగా దాన్ని కూడా సముద్రంలోకి గిరాటేసాడు.

మనం మన అలవాటుకి ఎంతగా బానిసలమన్నది ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. ఓ పట్టాన వదలవు కాబట్టి చెడ్డ అలవాట్లని చేసుకోకూడదు.